పలు కోర్సుల పరీక్షా తేదీలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ, ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి, బ్యాచ్‌లర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 19వ తేదీ నుంచి, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఎంబీఏ (నాన్ సీబీసీఎస్) ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

ఎంబీఏ మేనేజ్‌మెంట్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును 5వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీఈ కోర్సుల రివాల్యుయేషన్

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీఈ (నాన్ సీబీసీఎస్) సప్లమెంటరీ, బీఈ (ఏఐసీటీఈ) రెగ్యులర్, సప్లమెంటరీ, బీఈ (సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 7వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి 10వ తేదీలోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in.

ఏఐ గ్లోబల్ సమ్మిట్ సెప్టెంబర్ 24

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం ఐటీ శాఖ నిర్వహించే ఏఐ గ్లోబల్ సమ్మిట్ వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఐటీ శాఖ నిర్ణయించింది. జూలై 8-9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగాల్సిన సమ్మిట్‌ను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నామని, తిరిగి సెప్టెంబర్ 24న నిర్ణయించామని ఐటీ శాఖ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ అధికారి తెలిపారు. ఏఐకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వడంతో పాటు ఏఐ సిటీలో నగర శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రోజుల పాటు జరిగే సమ్మిట్‌ను పటిష్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, జూన్ 1: కళాకారులు నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత విష్ణు సహస్ర నామం, లక్ష్మీ అష్టోత్తరం, శ్రీ నందకాయ, అన్నమ్మ గాయత్రి, శ్రీ మద్వదీయ చరితాంమృత, అని అన్నమయ్య గురుస్తుతితో ప్రారంభించారు. అనంతరం కళాకృతిస్ గురువు ఎస్ సుజరిత, ఎస్ సుప్రజ వారి శిష్య బృందం సాయి కీర్తి, రిషిత, లిప్సిక, ఐశ్వర్య, ప్రవస్థి, అభినయ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రఖ్యాత సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం, కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతిని ఇచ్చి ప్రసాద వితరణ చేశారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి

కొండాపూర్, జూన్ 1: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'మానస స్కూల్ ఆఫ్ డ్యాన్స్' గురువు ప్రణవి తుమ్మాటి తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ప్రదర్శనల్లో అంబ పరాకు, వినాయ కౌతం, మూషిక వాహన, మీనాక్షి పంచరత్న, ముద్దుగారే యశోద, విన్నపాలు వినవలె, పలుకే బంగారమాయేనా, మరకత మణిమయ, ఇదిగో భద్రాద్రి, గరుడ గమన, బిందుమాలిని తిల్లాన అంశాలను కళాకారులు ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది.

రాణించిన సుకన్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా వేదికగా జరిగిన వరల్డ్ వుమెన్ మాస్టర్స్ క్లాసిక్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన తేజావత్ సుకన్య ఆకట్టుకుంది. మొత్తం 60 దేశాల నుంచి మొత్తం 1200 మంది ప్లేయర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు. మహిళల 76 కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య ఎనిమిదో స్థానంలో నిలిచి ఆకట్టుకుంది. జెనియా ఖాన్(కజకిస్థాన్), అంగెస్ రుడిన్(స్వీడన్), ఐరీ సకగుచి(జపాన్) వరుసగా టాప్-3లో నిలిచారు.

యంగ్ అంత్రప్రెన్యూయర్లకు సీడీఎఫ్‌డీ ఆఫర్

- ఇంక్యుబేషన్ నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 5తో ముగియనున్న గడువు

పిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఆంత్రప్రెన్యూయర్లుగా ఎదిగేందుకు అవసరమైన మార్గ నిర్దేశనం చేసేందుకు సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ ముందుకు వచ్చింది. సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా స్టార్టప్‌లకు అవసరమైన వర్క్ స్పేస్, మౌలిక వసతులు, గైడెన్స్‌తో ప్రత్యేక అవకాశం కల్పించింది. జూన్ 5లోగా సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో నమోదు చేసుకుని స్టార్టప్‌లు ప్రారంభించుకోవచ్చని ప్రకటనలో తెలిపింది.

రేపు వరల్డ్ బైస్కిల్ డే

- ప్రత్యేక రైడ్స్ ఏర్పాటు

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): జూన్ 3న వరల్డ్ బై స్కిల్ డేను పురస్కరించుకుని హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్, హ్యాపీ హైదరాబాద్ సైక్లిస్లు గ్రూపులు నగరంలో ఆదివారం ప్రత్యేక రైడ్ ఏర్పాటు చేశాయి. హెచ్‌సీజీ ఆధ్వర్యంలో నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆసుపత్రి నుంచి సోలార్ సైక్లింగ్ ట్రాక్ వరకు రైడ్ జరుగుతుందని ఫౌండర్ రవీందర్ తెలిపారు. నగరంలో సైక్లింగ్ వినియోగం పెంచడమే ప్రధాన లక్ష్యంగా రైడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హ్యాపీ హైదరాబాద్ సైక్లింగ్ ఆధ్వర్యంలో ఓఆర్ఓర్ సైక్లింగ్ ట్రాక్ -ఫారెస్ట్ ట్రాక్ పార్క్ - ఓఆర్ఆర్ సైక్లింగ్ ట్రాక్ మార్గంలో రైడ్ జరగుతుందని రవి తెలిపారు.

గాంధీ మెడికల్ కాలేజీలో జరిగిన డయాలసిస్ నోడల్ అధికారుల సదస్సును ప్రారంభించిన అధికారులు

కిడ్నీ, డయాలసిస్‌లపై గాంధీలో అవగాహన సదస్సు

బన్సీలాల్‌పేట్, జూన్ 1: కిడ్నీ సంబంధిత వ్యాధులు, డయాలసిస్ కేంద్రాల నిర్వహణ గురించి నోడల్ అధికారులతో గాంధీ మెడికల్ కాలేజీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ విశాలాక్ష్మి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మంజూషలు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గాంధీ దవాఖాన హబ్ పరిధిలోని 22 డయాలసిస్ స్పోక్ కేంద్రాల నోడల్ అధికారుల నైపుణ్యాలను పెంచి, గ్రామీణ ప్రాంత నిరుపేద కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ సదస్సులో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జనగామ, ఇల్లందు, ఖమ్మం, కోరుట్ల, వేములవాడ, గోదావరిఖని, హుజూరాబాద్, భద్రాపురి, జగిత్యాల, మణుగూరు, మహదేవ్‌పూర్, జాఫర్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట్, నర్సంపేట్, మహబూబాబాద్ డయలసిస్ కేంద్రాల నోడల్ అధికారులు హాజరయ్యారు. గాంధీ దవాఖాన నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ విక్రమ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటీరియర్ డిజైనింగ్‌లో అవార్డులు

బంజారాహిల్స్, జూన్ 1: ఇంటీరియర్ డిజైనింగ్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 42 మందికి ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. బి.భాస్కర్ రావు, ఐఐఐడీ చైర్ పర్సన్ పల్లవి అంచూరి తదితరుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. పదిహేనేండ్లుగా ఇంటీరియర్ డిజైనింగ్ రంగంలో అవార్డులు అందిస్తున్నామని అవార్డుల కోకన్వీనర్ ఏఆర్.రవి అంచూరి తెలిపారు.

నిమ్స్‌కు గవర్నర్ ప్రశంసలు

ఖైరతాబాద్, జూన్ 1: నిమ్స్ దవాఖాన వైద్యుల కృషిని గవర్నర్ సీపీ రాధాకిషన్ అభినందించారు. ఇటీవల ఛత్తీస్‌గడ్‌కు చెందిన గుత్తి కోయ యువకుడు సోది నంద గుండె, ఊపిరి తిత్తుల మధ్య బాణం గుచ్చుకోగా, నిమ్స్ కార్డియోథొరాసిక్ వైద్యులు డాక్టర్ అమరేశ్వర్ రావు బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించి బాణాన్ని తొలగించి అతని ప్రాణాలను రక్షించారు. ఎంతో క్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను విజయవంతం పూర్తి చేసిన వైద్యుల బృందాన్ని, నిమ్స్ ఖ్యాతిని పెంచిన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పను గవర్నర్ సీపీ రాధాకిషన్ రాజ్ భవన్ తరపున పంపించిన సందేశంలో అభినందనలు తెలిపారు.

కేసీఆర్‌కు జ్వాలా సజీవ వాహిని - సనాతన ధర్మం

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): తాను రాసిన 'సజీవ వాహిని - సనాతన ధర్మం' తెలుగు పుస్తకాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు మాజీ సీపీఆర్‌వో వనం జ్వాలా నరసింహారావు అందించారు. భారతీయ, హైందవ, వైదిక సంస్కృతికి సంబంధించిన అనేక సనాతన ధర్మాలను, వేదాల నుంచి ప్రబంధాల వరకున్న అనేక గ్రంథాల నుంచి సేకరించిన 90 వ్యాసాలతో కూడిన ఈ పుస్తకంలో ఆసక్తికలిగించే పలు అంశాలున్నాయని రచయిత కేసీఆర్‌కు వివరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి కుసుంబ సీతారామారావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాలేరు మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- వివరాలను వెల్లడించిన ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సంబంధించి 4న జరిగే ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. శనివారం నిజాం కాలేజీలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై రొనాల్డ్ రాస్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో 13 లోకేషన్లలో 16 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 20 టేబుళ్లు, మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యాకత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 24 రౌండ్లు, చార్మినార్‌లో అత్యల్పంగా 15 రౌండ్‌లలో లెక్కింపు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మొదటి ఫలితం చార్మినార్ వచ్చే అవకాశం ఉన్నదని, మధ్యాహ్నం మూడు గంటల వరకు పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు 17 రౌండ్లు ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నాంపల్లి, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలో మూడు చోట్ల ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

3 చోట్ల.. మల్కాజిగిరి ఓట్ల లెక్కింపు

మేడ్చల్, జూన్1(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 4న ఉదయం 8.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానున్నది. మల్కాజిగిరి లోక్ సభ పరిధిలో మూడు చోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి కీసర మండలం భోగారంలోని హోలీమేరీ కళాశాల, ఎల్బీనగర్ నియోజకవర్గానికి సంబంధించి సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సికింద్రాబాద్‌లోని వెస్లీ కళాశాలలో నిర్వహించనున్నారు.

ఎల్లుండి వైన్‌షాపులు బంద్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈనెల 4న సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 144వ సెక్షన్ విధిస్తూ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీచేశారు. అంక్షల సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, సమావేశలకు అనుమతి లేదని ఆదేశాల్లో పేర్కొన్నారు. అంతే కాకుండా ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమ్మిగూడటం నిషేధమన్నారు. ఈ నెల 4 ఉదయం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. అంతే కాకుండా ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 4న ఉదయం ఆరు గంటల నుంచి ఈ నెల 5న ఉదయం ఆరు గంటల వరకు కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు వెల్లడించారు.

పునర్నిర్మాణానికి సమష్టి కృషి అవశ్యం

సమావేశలోంలో మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 1: తెలంగాణ పునర్నిర్మాణానికి సమష్టిగా కృషి చేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధిలో ముందుకు వెళ్లే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ప్రొ. జి.హరగోపాల్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో, తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టీఏఎస్ఏ), బోధనేతర సిబ్బంది సంఘం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇప్పుడే పౌరుల గొంతుక ప్రభుత్వానికి వినిపించే అవకాశాలున్నాయన్నారు. విశ్వవిద్యాలయాలు చైతన్యవంతంగా ఉంటే పౌర సమాజం బాగుంటుందన్నారు. ప్రభుత్వాలు నిరంతరం ప్రజలతో చర్చలు కొనసాగిస్తుండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులలో అధిక శాతం సన్న చిన్న కారు రైతులున్నారని, వారి అభ్యున్నతిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. ఎం.కోదండ రాం అన్నారు. దేశంలోనే అధిక శాతం విత్తన బండాగారం తెలంగాణకే సాధ్యమని, అందుకు అనుగుణంగా వనరులున్నాయని సూచించారు. విశ్వవిద్యాలయాలను స్వేచ్ఛగా కొనసాగిస్తేనే మంచి ఫలితాలు పొందగలమన్నారు. విశ్వవిద్యాలయాలు పురోగతి దశలో నడిపితేనే అమరవీరుల త్యాగాలకు అసలైన నివాళి అని పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ పి.రఘురామిరెడ్డి అభిప్రాయ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంకా టీఏఎస్ఏ అధ్యక్షులు డా. విద్యాసాగర్, బోధనేతర సిబ్బంది సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ డా.వనమాల, ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె డా. జీవీ వెన్నెల పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, బోధనా బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక

మేడ్చల్, జూన్ 1: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గాను జిల్లా జట్టు ఎంపికకు శనివారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 8, 10, 12, 14, 16, 18, 20 ఏళ్లలోపు విభాగాల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్, క్రీడా పాఠశాల అధికారి రతన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా వారు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 6, 7 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, సభ్యులు దయాళ్, శేఖర్, సురేందర్, వరలక్ష్మి, పలక్ గులేరియా, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకల్లో భాగస్వామ్యం కండి

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నమంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తదితరులు

కంటోన్మెంట్/కవాడిగూడ, జూన్ 1: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రం ఏర్పడి పదేళ్లపూర్తున్న నేపథ్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దిన వేడుకలు జరుపుకుంటున్నట్లు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులు తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఆదివారం జరగనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులు శనివారం పర్యవేక్షించారు. వేడుకల నిర్వహణతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవకుండా పోలీసులు చేపడుతున్న బందోబస్తు వివరాలను మంత్రులకు నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణ కోసం ఉద్యమించిన ప్రతి పౌరుడు, కుల సంఘాల జేఏసీ, తెలంగాణ సమాజం ఆర్టీసీ, సింగరేణి, జర్నలిస్ట్‌లు, ఎన్జీవోలు, రిటైర్డు ఉద్యోగులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలంగాణ ఆకాంక్షలను అందరూ గమనించాలని సూచించారు. ప్రతి తెలంగాణ బిడ్డ ఉత్సాహంగా జరుపుకోవాలని, అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య పాల్గొన్నారు.

హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ)/కొండాపూర్: గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి రాములు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పదవీ ముగియడంతో నూతన శాఖ అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి నియమితులయ్యారు. ఆయన పదవీలో మూడేండ్ల పాటు కొనసాగనున్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన వర్సిటీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన రాములుకు ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యాపక వర్గం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎన్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ ఆచార్య ప్రభాకర్ రావు, పూర్వ శాఖాధ్యక్షులు దార్ల వెంకటేశ్వర్‌రావు, ఆచార్యాలు ఎం. గోనా నాయక్, డి.విజయలక్ష్మి, వంగరి త్రివేణి, భూక్యా తిరుపతి, బాణాల భుజంగరెడ్డి, పి.విజయ్ కుమార్, బాశెట్టి లత, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో రూ.4.09 కోట్లు ఫ్రీజ్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ళ వలలో చిక్కుకున్న రూ.4.09 కోట్లను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేసి, బాధితులకు న్యాయం చేశారు. వివరాల్లోకి వెళితే.., మే 1 నుంచి 31వరకు నెల రోజుల్లో పలు రకాల సైబర్ మోసాలబారిన పడి, ఆన్‌లైన్‌ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న కేసులను నమోదు చేసుకున్న నగర సైబర్‌క్రైమ్ పోలీసులు వేగవంతంగా, సమర్థవంతమైన దర్యాప్తు జరిపారు. ఇందులో భాగంగా సైబర్ నేరస్తులకు చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లోని బాధితుల సొమ్ము రూ.4,09,23,217ను ఫ్రీజ్ చేశారు. ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశకు దూరంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులను నమ్మవద్దని, ఆన్‌లైన్ పరిచయాలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గ్రేటర్‌లో తొలిసారిగా పుష్పక్ ఏసీ రూట్ పాస్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో అదనంగా 8వ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను సోమవారం నుంచి నడపనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఏఎస్ రావు నగర్ - సైనిక్‌పురి, అమ్ముగూడ - లాల్‌బజార్ - కార్ఖానా-జేబీఎస్ మార్గంలో బస్సులు ప్రతి 13 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనంతరం, గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ప్రయాణికుల కోసం తొల